క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే

మదనపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే జరుగుతుందని ఆర్డీఓ హరిప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యలపై ఆర్డీఓ వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్మికుడికి ఆర్థికసాయం


సాయం అందజేస్తున్న సంఘు నాయకులు

బి.కొత్తకోట: బి.కొత్తకోటకు చెందిన పెయింటింగ్ కార్మికుడికి హార్డ్ వేర్ అసోసియేషన్ ఆదివారం ఆర్థిక సాయం అందించింది. పెయింటర్ పని చేసుకుని జీవించే కార్మికుడు లక్ష్మినారాయణకు కొంతకాలం క్రితం ఒక కాలు తొలగించారు. అతని ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న సంఘం నాయకులు బుద్దల వెంకటరెడ్డి, ధర్మ, శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు రూ.10 వేల సహాయం అందజేశారు.

ఎన్డీయే కూటమి సంబరాలు


సంబరాలలో పాల్గొన్న నాయకులు

తంబళ్లపల్లె: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించి భారత ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలో నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా పేలుస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బెంగళూరు ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు పలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ ఈఆర్వో శంకర్, మొరుసుకాపు సంఘం మలిగి దేవేంద్రరెడ్డి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం


హరికథాగానం చేస్తున్న రెడ్డికుమారి

పీలేరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదివారం మహాభారతయజ్ఞం ప్రారంభమైంది. మొదటి రోజు మధ్యాహ్నం బంగారుపాళెంకు చెందిన భాగవతారిణి టి.రెడ్డికుమారిచే సర్పయాగం హరి కథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి వెంకటేశ్వర నాట్యకళామండలి మల్లికార్జున బృందంచే శ్రీకృష్ణ లీలలు నాటకం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు మహా భారతయజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజనాయక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 35 మంది ఎంపిక


వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరు: ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు 35 మంది ఎంపికైనట్లు పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామనాయుడు, ఏవో కృష్ణ గల్లా పేర్కొన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ట్రస్టు ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి కంటి పరీక్షలు చేసి 25 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అరవింద్ నేత్రాలయ సిబ్బంది జీవన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మజ్ఞానంపై బోధన

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఆవరణలో ఉన్న సరస్వతి పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆత్మజ్ఞానంపై బోధనా కార్యక్రమం ఉంటుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ప్రతినిధి ఆంజనేయులు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరానికి చెందిన బ్రహ్మవిద్యార్థిష్ఠ తటపర్తి రాజ్యలక్ష్మి ఆత్మజ్ఞానంపై బోధన చేస్తారన్నారు. ప్రజలు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ధాన్యపు గెరిశెలు కనుమరుగు

గుర్రంకొండ: సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వరకు ఒక వెలుగు వెలిగిన ధాన్యపు గెరిశెలు ప్రస్తుతం ప్రాభవం కోల్పోయి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాలు, పచ్చని పంట పొలాలు, ధాన్య రాశులతో కళకలలాడే పల్లె సీమల సంస్కృతికి చిహ్నాలుగా ధాన్యపు గెరిశెలను చెప్పుకోవచ్చు. పండించిన పంటలను ప్రస్తుతం బస్తాల్లో నింపి ఇళ్లలో భద్రపరుచుకుంటారు. గతంలో పంట దిగుబడి ఎక్కువగా ఉన్న కాలంలో ధాన్యాన్ని బస్తాల్లోగాక, గెరిశెల్లో దాచేవారు. పెద్ద గెరిశెలు ఏర్పాటుచేసి వాటికి ఒక చిన్న ముఖ ద్వారాన్ని పైభాగంలో అమర్చేవారు. అ చిన్న ముఖద్వారం గుండా ధాన్యాన్ని గెరిశెల్లో వేసి నింపేవారు. సుమారు వంద బస్తాలు నింపే గెరిశెలు ఆకాలంలో నిర్మించుకొనేవారు. అవసరమైనప్పుడు కావలసినంత ధాన్యాన్ని గెరిశెల్లో నుంచి తీసుకుని వాడుకునేవారు. అప్పట్లో పెద్ద రైతు కుటుంబాలకు చెందిన వారి ఇళ్లలో గోడల్లోనే గెరిశెలను ఏర్పాటు చేసుకొనేవారు. రానురానూ బస్తాల వాడకం అమలులోకి వచ్చాక వీటి వినియోగం తగ్గిపోయింది. ప్రస్తుతం పండించిన పంటను ఇంటి అవసరాలకు సరిపడా పంచుకొని మిగిలిన ధాన్యాన్ని అప్పటికప్పుడే అమ్మేస్తున్నారు. దీంతో గెరిశెల ప్రాధాన్యం ఈ తరం వారు గుర్తించకపోవడంతో నిరుపయోగంగా మారి నాటి జ్ఞాపకాలకు చిహ్నాలుగా నిలిచిపోతున్నాయి.


నిరుపయోగంగా ఉన్న ధాన్యపు గెరిశెలు

భారీ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయ స్వామి విగ్రహం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం భువనేశ్వరీ నగర్‌లోని భువనేశ్వరీ ఆలయంలో ఆదివారం 32 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సుమారు 14 ఏళ్లుగా ఆలయంలో ప్రత్యేక చలువ పందిళ్ల కింద 275 టన్నుల ఏక శిల విగ్రహాన్ని తమిళనాడుకు చెందిన శిల్పులు చెక్కారు. ఆలయం ఎదుట భారీ క్రేన్ సహాయంగా ఏర్పాటు చేశారు. భువనేశ్వరీ అమ్మవారి సేవకులు వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. భక్తులు తిలకించి స్వామికి పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో పూజలు


గుండ్లూరు మూలస్థానమ్మకు సమర్పించేందుకు బోనాలు తెస్తున్న మహిళలు

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన దేశాయి మూల స్థానమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజున ఆదివారం గుండ్లూరుతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఊరేగింపుగా మహిళలు బోనాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కలికిరి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గుట్టపాళ్యెం గ్రామంలో వెలసిన పాలేటమ్మ, చీకటిపల్లి గ్రామం రంగనాథపురంలో వెలసిన నడివీధి గంగమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా భక్తాదులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు: భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నగిరిపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పీలేరు నియోజకవర్గ పరిధిలో విచ్చలవిడిగా భూ ఆక్రమణలు జరిగాయని తెలిపారు. పీలేరులో పరిశ్రమలకు అనువుగా, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏపీఐఐసీకి భూములు కేటాయించడం జరిగిందన్నారు. ఆ భూముల్లో ప్లాట్లు వేసి కొందరు విక్రయించారని ఆరోపించారు. తిరుపతి మార్గంలో ఆయిల్స్ సీడ్స్ స్థలం ఇష్టా రాజ్యంగా పంచిపెట్టారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలకు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్స్ ఇచ్చిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌హెచ్‌కు అవసరమైన మట్టిని ఇష్టారాజ్యంగా చెరువుల్లో, గుట్టల్లో తీయడం జరిగిందని, తద్వారా ప్రకృతికి విఘాతం కల్గిందన్నారు. దీనిపైనా విచారణ జరిపిస్తామని చెప్పారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


అలంకరణలో దిగువ దిండి గంగమ్మతల్లి

తంబళ్లపల్లె: మండలంలోని గోపీదిన్నె పంచాయితీలో వెలసిన దిగువ దిండిగంగమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా కొత్తపల్లె, బల్లాపురంపల్లె, ఉప్పులూరివాండ్లపల్లె, గోపీదిన్నె, దళితవాడ ప్రజలు వైభవంగా జాతర నిర్వహించారు. పూజారులు ప్రభాకర్, వెంకటేష్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీబండ్ల మెరవణి ఆకట్టుకుంది.

ఉలవల గంగమ్మ గుడికి రూ. లక్ష విరాళం

పీలేరురూరల్: మండలంలోని తలపుల పంచాయతీ ఉలవల గంగమ్మ గుడికి రొంపిచెర్ల మండలం బండకిందపల్లెకు చెందిన జేసీబీ అమరనాథ్ రెడ్డి లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఆదివారం ఉలవల గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికిగానూ అమరనాథరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణ నాయుడు, మల్లికార్జున నాయుడు, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దాతలు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డైట్ సభా భవనంలో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జీఓ -117ను వెంటనే రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలని, పాఠశాలల విలీనాన్ని రద్దుచేయాలని కోరారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో హరిప్రసాద్, సుధాకర్‌నాయుడు, శివారెడ్డి, హేమలత, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు రమణమూర్తి, వెంకటరమణ, ఆదినారాయణ, శ్రీధర్‌రెడి పాల్గొన్నారు.

ఏనుగు మల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై వెలసిన ఏనుగు మల్లమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించారు. ఏనుగు మల్లమ్మ విగ్రహానికి చందనంతో అభిషేకించి పుష్పాలు, చీర, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. కాండ్లమడుగు గ్రామస్థులు జి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి దంపతులు తొలి పూజ నిర్వహించి పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఏనుగు మల్లమ్మను దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారు హంస వాహన సేవ జరిపారు. ఈ సందర్భంగా హార్సిలీ హిల్స్‌ను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం నుంచి గాలిబండ, అటవీ ప్రాంగణం, చుట్టూ ఉన్న రోడ్ల వెంబడి విద్యుద్దీపాలతో అలంకరించారు.


ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ

రెడ్డెమ్మకొండకు పోటెత్తిన భక్తజనం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా నమ్మిన భక్త జనం ఆలయానికి ఉదయం నుంచే తరలివచ్చారు. పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీచేసే ఆకు పసరు తాగి అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. అనంతరం తడిబట్టలతోనే అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరె సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. హిందువులతోపాటు పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకున్నారు.


సంతానం కోసం అమ్మవారి ఎదుట మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

రెడ్డెమ్మకొండ ఛైర్మెన్ రాజీనామా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మ కొండ ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ నరసింహారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం రెడ్డెమ్మకొండ ఈవో మంజులకు తన రాజీనామా పత్రాన్ని పంపారు. రెండు పర్యాయాలు తనకు ఛైర్మెన్‌గా అవకాశం లభించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినందున తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


నరసింహారెడ్డి

దక్షిణామూర్తి స్తోత్రం గ్రంథావిష్కరణ

మదనపల్లె సిటీ: పద్య కవి, బహు గ్రంథకర్త నల్లపరెడ్డి రవిశేఖర్‌రెడ్డి రచించిన కవితాత్మక అనువాద గ్రంథం దక్షిణామూర్తి స్తోత్రం గ్రంథావిష్కరణ ఆదివారం జరిగింది. స్థానిక బెంగుళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ దక్షిణామూర్తి ధ్యాన స్తోత్రములకు, శ్లోకములకు ప్రతి పదార్థములు, భావాలు అదించిన రచయిత రవిశేఖర్‌రెడ్డి ధన్యులని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న వారు ఆరోగ్యం, ఆయుష్షు పెంపొందించుకొనుటకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రముఖ రచయిత తోకల సిద్దయ్య మాట్లాడుతూ నిరాకారుడు, నిశ్చలుడైన దక్షిణామూర్తి మౌనంగా ఆత్మజ్ఞానాన్ని, స్థిత ప్రజ్ఞతను అందివ్వగల నిరాకార విరాట్ స్వరూపుడని తెలిపే గ్రంథం పఠనంతో కలిగే శుభ ఫలితాలను వివరించారు. ఆత్మ జ్ఞాన ప్రబోధకులైన దక్షిణామూర్తి నిశ్చలతత్వంలోని నిగూఢ భావాలను, వాటిద్వారా మానవ జాతికి అందుతున్న సందేశాలను వివరించారు. సీనియర్ సిటిజెన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ అధ్యాత్మిక గ్రంథాల పఠనం సీనియర్ సిటిజన్స్‌కు ఎంతో అవసరమన్నారు. దక్షిణామూర్తి గురించి ఎంతో కాలంగా వింటున్నానని, ఇంత సవివరంగా తెలియదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, గొల్లపూడి తిరుపతిరావు, శ్రీనివాసులు, వాసా కృష్ణమూర్తి, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



దక్షిణామూర్తి స్తోత్రం గ్రంథావిష్కరణ చేస్తున్న రచయితలు

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక అబ్బయ్యగారి వీధిలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఎనలేని పోరాటం చేసిందన్నారు. రానున్న రోజుల్లో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆర్.వి.రమణ, మురళి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీయూ భవనంలో నినాదాలు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పీలేరు: స్థానిక ఎస్‌కేఆర్ హాస్పిటల్ నందు ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మదనపల్లెకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్ఆర్.బాషా ఆధ్వర్యంలో 66మంది గుండె జబ్బు ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్, లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ కౌంట్స్, 2డీ ఏకో పరీక్షలు ఉచితంగా నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా రోగులకు చికిత్స చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.యం.బాషా, వైద్యులు డాక్టర్ ఎస్.కె.యం. వసీం, డాక్టర్ ఆస్పియా తదితరులు పాల్గొన్నారు.


గుండె వైద్య చికిత్స చేస్తున్న వైద్యులు

ప్రజలు శాంతియుతంగా ఉండాలి

కేవీపల్లె: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని ఎస్ఐ రహీముల్లా పేర్కొన్నారు. కేవీపల్లె, గర్నిమిట్టలో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ఘర్షణలు, దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


గర్నిమిట్టలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

నాటి జ్ఞాపకాల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులు ప్రేమకుమారిని సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు


ఏళ్ల తర్వాత ఒక చోట చేరిన 1981-82లో పదో తరగతి పూర్వ విద్యార్థులు

43 ఏళ్ల తర్వాత కలిసి పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ: చిన్ననాటి జ్ఞాపకాలనె నెమరువేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో కలిసిన వారంతా మళ్లీ 43 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఒక చోట చేరి ఆనందం పంచుకున్నారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు బాబూలాల్, ఆర్.వి.క్రిష్ణకుమార్, జియావుద్దీన్, ఆర్ సి.నిరంజన్ తమతోపాటు చదువుకున్న వారి పేర్లను సేకరించి సామాజిక మాధ్యమాల ద్వారా వారిని ఒకచోట చేర్చాలని నిర్ణయించారు. మదనపల్లెతోపాటు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, ప్రేమకుమారి, పాపులమ్మ, గంగుల్‌రెడ్డి, పద్మావతమ్మ, సుశీలమ్మ, రాటకొండ కృష్ణమూర్తి, సుధాలకు మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తాము ఈ స్థాయిలో ఉన్నామంటే ఉపాధ్యాయులే కారణమని చెప్పారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. పాఠశాలకు మైక్‌సెట్ వితరణగా ఇవ్వనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, పాల్ చంద్రశేఖర్, నాగేంద్ర, కె.గీతాతార, ఉమారాణి పాల్గొన్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా...!

బి.కొత్తకోట: మదనపల్లె బీటీ కళాశాలలో 1978–80లో ఇంటర్ చదువుకున్న అప్పటి విద్యార్థులు 44 ఏళ్ల తరువాత ఒక వేదిక పైకి వచ్చి కలుసుకున్నారు. ఎక్కడెక్కడో, వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా ఒక్క చోట చేరి సంతోషం పంచుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లోని పర్యాటక శాఖ కాన్ఫరెన్సు హాలులో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 128 మంది విద్యార్థులు చేరుకుని విందు, వినోదాలతో సందడి చేశారు. డాక్టర్ రవికుమార్, రఫీక్‌అహ్మద్, నివిశ్వనాథరెడ్డి, గ్రంథాలయ అధికారి జనార్దనరెడ్డి, హెచ్‌ఎం రుషికేశవ్ ,గిరిప్రకాష్, నాగరాజు పాల్గొన్నారు.


హార్సిలీహిల్స్‌లో పూర్వపు విద్యార్థుల సమావేశం